
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
మంగళవారం 16 సెప్టెంబరు 2025 | 5



డీఎల్‌పీవో కార్యాలయ ఏవోపై విచారణకు డీఆర్వో ఆదేశం 7
పెట్రోల్, డీజిల్‌తో అర్ధరాత్రి ప్లాట్‌కి నిప్పు 7

సమసమాజ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకం

» జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా
» గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా ఇంజనీర్స్ డే

కాకినాడ సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సమసమాజ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమైనదని జిల్లా జేసీ రాహుల్ మీనా అన్నారు. తాను కూడా ఐఏఎస్ కాక ముందు ఇంజనీర్‌నే అని ఆయన వెల్లడించారు.భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా జేఎన్‌టీయూకే-ఆర్టీవో ఆఫీసురోడ్డులోని జిల్లా గృహ నిర్మాణశాఖ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఇంజనీర్స్‌డే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సభాధ్యక్షుడు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులుగా గృహనిర్మాణశాఖ పీడీ, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎన్‌వీవీ సత్యనారాయణ, రిటైర్డ్ పీడీ సుధాకర్ పట్నాయక్, రిటైర్డ్ ఈఈ గుప్త, పెద్దాపురం డివిజన్ ఇన్‌చార్జి ఈఈ శ్రీనివాస్, హౌసింగ్ మేనేజర్ కె.సురేష్‌బాబు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ వైడీ రామారావు పాల్గొన్నారు. గృహనిర్మాణశాఖ జిల్లాకార్యాలయంలో జరిగిన ఈకార్యక్రమాన్ని ముఖ్యఅతిథి రాహుల్ మీనా, ఇతర అతిథులు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాకినాడ నగరంలోని ప్రముఖ ఇంజనీర్ బాదం సుందరరావును ఘనంగా సన్మానించారు.

రక్తదానం చేసిన రాహుల్ మీనా

ఇంజనీర్స్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో జేసీ రాహుల్‌మీనా రక్తదానం చేశారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకున్న మరికొంతమంది గృహనిర్మాణశాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగులు తరలివచ్చి రక్తదానం చేశారు. కరప మండలం నడకుదురు గ్రామంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, దుప్పట్లు, ఇతర వస్తువులు పంపిణీ చేశారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్ మీనా

భారత జాతి గర్వించదగ్గ వ్యక్తి విశ్వేశ్వరయ్య
» కాకినాడ జేఎన్టీయూ ఉపకులపతి ప్రసాద్ 6

ప్రజలతో..కలవండి

జిల్లా కలెక్టర్లు ప్రజలతో నిత్యం మమేకమవ్వాలి

» హాస్టళ్లలో రాత్రి నిద్ర చేయాలి
» పర్యాటకానికి భూములు గుర్తించండి
» నెలనెలా పర్యాటక సమావేశాలు పెట్టాలి
» అమరావతిలో తొలిరోజు కలెక్టర్ల సదస్సు
» సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
» ఉప్పాడ హార్బర్ డిజైన్ మార్చాలన్న కలెక్టర్
» కృష్ణబాబుతో చర్చించాలన్న సీఎం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

జిల్లా కలెక్టర్లు ప్రజలతో నిత్యం మమేకం అవ్వాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. జిల్లా అభివృద్ధిలో కలెక్టర్ల పాత్ర అత్యంత కీలకమని, ప్రజలకు సేవలందించే విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. అమరావతిలో సోమవారం జిల్లా కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రాధమ్యాలు నిర్ణయించుకుని పని చేయాలని సూచించారు. జిల్లాలో రెవెన్యూదేవా దాయ, ఆర్‌అండ్‌బీ, జలవనరుల శాఖకు సంబంధించిన విలువైన భూములను కలెక్టర్లు గుర్తించాలని సీఎం ఆదేశించారు. పర్యాటక అభివృద్ధి అత్యంత కీలకమని, కలెక్టర్లు ప్రత్యేకంగా దీనిపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో నెలనెల పర్యాటక కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రసాద్ పథకం కింద అన్నవరం దేవస్థానంలో చేపడుతున్న పనులపై కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించాలని ఆదేశించారు.ఇదిలా ఉంటే జిల్లాకు సంబంధించి కొన్ని కీలక సమస్యలను జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఉప్పాడలో హార్బర్ నిర్మాణంలో భాగంగా బ్రేక్‌వాటర్ రాళ్ల వరుసలో లోపాల కారణంగా తరచూ పడవలు,ఇతర బోట్లు ఢీకొని ముక్కలై పోతున్నాయని.. మత్స్యకారులు చనిపోతున్నారని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. హార్బర్ డిజైన్ మార్చకపోతే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. దీంతో సీఎం చంద్రబాబు స్పందిస్తూ ఆర్‌అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబుతో చర్చించి ఏంచేయా లనేదానిపై నిర్ణయానికి రావాలని ఆదేశించారు. జిల్లాలో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్ డీబీ) సాయంతో గతంలో రూ.169 కోట్లతో 14 రహదారుల నిర్మాణానికి ఒకే ప్యాకేజీ కింద టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. అయితే గత 8 నెలలు గా వీటికి సంబంధించి రూ.13 కోట్ల వరకు బిల్లులు ఆగిపోయాయి. దీంతో ఆయా రహదారుల పనులను కాంట్రాక్టర్లు మధ్యలో నిలిపివేశారు. వాటిని విడుదల చేయాలని కోరారు. కరప మండలంలో వేలాదిగా ఉన్న ఉప్పు భూముల్లో మల్టీ ప్రొ డక్ట్ పరిశ్రమల పార్కు, ఇతర క్లస్టర్లను ఏర్పా టు చేయాలని ఆదేశించారు.


అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు.. కలెక్టర్ షాన్‌మోహన్

ప్రగతి పరుగు

- వ్యవసాయ,పారిశ్రామిక,సేవా రంగాల్లో కాకినాడ జిల్లా అంతకంతకు వేగంగా అభివృద్ధి చెందుతోంది.స్థూల జిల్లా దేశీయ ఉత్పత్తి (జీడీ డీపీ)లో జిల్లా తొలి క్వార్టర్‌లో మంచి పని తీరు కనబర్చింది.ఇతర జిల్లాలతో పోల్చితే జీడీడీపీలో వేగం పుంజుకుంటోంది. అమరావతిలో సోమవా రం నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ప్రభుత్వం జిల్లాల వారీగా జీడీపీపీలకు సం బంధించిన పనితీరు గణాంకాలను విడుదల చేసింది. ఆయా జిల్లాల్లో అన్ని రంగాలకు కలిపి జీడీడీపీ కింద నిర్దేశించిన వార్షిక లక్ష్యాల ఛేదన ఏ స్థాయిలో ఉందో విశ్లేషించింది. దీని ప్రకారం కాకినాడ జిల్లాకు 2025-26ఆర్థిక సంవత్సరా నికి సంబంధించి జీడీడీపీ లక్ష్యం 80,427 కోట్లు కాగా, ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలకు సంబంధించి తొలి క్వార్టర్‌లో రూ.15,575 కోట్లు అధిగమించింది. రెండు,మూడు,నాలుగు క్వార్టర్లకు సంబంధించి రూ.64,652కోట్లు సాధిం చాల్సి ఉన్నట్లు గణాంకాలు వెల్లడించాయి.
- వ్యవసాయ అనంబంధ రంగాలకు సంబంధించి స్థూల అదనపు విలువ (జీవీఏ) 2025- 26 ఆర్థిక సంవత్సరానికి రూ.24,668 కోట్లు లక్ష్యం విధించగా తొలి క్వార్టర్‌కు రూ.3,263 కోట్లు సాధించింది. మూడు క్వార్టర్లకు కలిపి రూ.21,424 సాధించాల్సి ఉంది.
- పరిశ్రమల రంగానికి సంబంధించి జిల్లా 2025-26 జీవీఏ లక్ష్యం రూ.20,660కోట్లు కాగా తొలి క్వార్టర్‌లో రూ.4,716 కోట్లు సాధించింది. ఇంకా మూడు క్వార్టర్లకు కలిపి రూ.15,944కోట్లు చేరుకోవాల్సి ఉంది.
- సేవా రంగానికి సంబంధిం చిన జీవీఏ వార్షిక లక్ష్యం రూ.28,488కోట్లు కాగా తొలి క్వార్టర్‌లో రూ.6,639 కోట్లు నమోదైంది.

ప్రభుత్వం స్వర్ణాంధ్ర సాధనకు సంబంధించి ఉత్తమ పనితీరుకు సంబంధించి కీ పర్‌ఫార్మెన్స్ సూచికలు విడుదల చేయగా కాకినాడ జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. మొత్తం 64 స్కోరుతో బీ గ్రేడ్ సాధించింది. ఈ విభా గంలో రాష్ట్రంలో పది అత్యుత్తమ మండలాలను ప్రకటించగా అందులో కాకినాడ రూరల్ 80 స్కోరుతో ఏగ్రేడ్, కాకినాడ సిటీ 80 స్కోరుతో ఏ గ్రేడ్‌లో నిలబడ్డాయి. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పనితీరుకు సంబంధించి ర్యాంకింగ్‌లు ప్రకటించగా,కాకినాడ జిల్లా మూడో స్థానం దక్కించుకుంది. 33 స్కోరుతో సీ గ్రేడ్ దక్కించుకుంది. ఈ కేటగిరీలో అత్యధిక స్కోరు 35. పరిశ్రమల రంగంలో జిల్లా పనితీరు సూచికలో 18వ ర్యాంకు దక్కించుకుంది. సేవా రంగంలో జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానం దక్కించుకుంది. 94 స్కోరుతో ఏప్లస్ గ్రేడ్ సాధించింది.

అమరావతిలో కలెక్టర్ల సదస్సు ప్రారంభం

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో సోమవారం నాలుగో జిల్లా కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. సీఎం చంద్రబాబు ఈ సదస్సుకు అధ్యక్షత వహించారు. సదస్సులో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పాల్గొన్నారు. జిల్లాలో ప్రగతి, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించి సీఎం దిశానిర్దేశం చేశారు. జీఎస్డీపీ, సంక్షేమం, పీ-4, సూపర్‌సిక్స్ వంటి అంశాలపై సమీక్షించారు. లాజిస్టిక్స్, ఇన్ఫ్రా, స్వచ్ఛాంధ్ర, సర్క్యులర్ ఎకానమీలో చర్చ జరిగింది. కాకినాడ జిల్లా సమగ్ర అభివృద్ధికి చేపట్టాల్సిన, తీసుకోవాల్సిన చర్యలు, ప్రణాళికలు, సమగ్రంగా రూపొందించుకున్న నివేదికలను సీఎంకు కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ వివరించనున్నారు.

యూరియా కొరత లేదు : సీఎం

రాష్ట్రంలో యూరియా కొరత లేదని, యూరియా నిల్వలు సమృద్ధిగానే ఉన్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతిలో ప్రభుత్వం నిర్వహించిన కలెక్టర్ల సదస్సు వీడియో కాన్ఫరెన్స్‌కు సోమవారం కాకినాడ కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా హాజరయ్యారు. అమరావతి నుంచి సీఎం చంద్రబాబు అన్ని జిల్లాల జేసీలతో మాట్లాడారు. రైతులకు సకాలంలో యూరియా అందేలా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. యూరియా అవసరమైతే డోర్ డెలివరీ చేయగలమన్నారు. యూరియా నిల్వలు వచ్చిన వ్పుడు ఒక ప్రణాళిక ప్రకారం సర్దుబాటు చేయాలని ఆదేశించారు.



ప్రజారోగ్యం దృష్ట్యా పంటల్లో యూరియా వినియోగం తగ్గిస్తే మంచిదన్నారు. ట్రైనీ కలెక్టర్ మనీషా, సీపీవో త్రినాథ్, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ రత్నరాజు, సర్వే శాఖ ఏడీ కె.శ్రీనివాసు, వ్యవసాయ శాఖ జేడీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ తుది ఎంపిక జాబితా

విడుదల

» మొత్తం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1,353 ఖాళీలు
» 1,349 మంది అభ్యర్థుల ఎంపిక
» భర్తీకాని ఉద్యోగాలు.. నాలుగు
» కాకినాడ జిల్లా డీఈవో పిల్లి రమేష్

కాకినాడ రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 అభ్యర్థుల తుది ఎంపిక జాబితాలను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులకు విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. ఎంపిక పరిధిలోకి వచ్చిన అభ్యర్థుల ధ్రువపత్రాలను సవివరంగా పరిశీలించి మేనేజ్‌మెంట్, పోస్టుల వారీగా తుది ఎంపిక జాబితాలను రూపొందించారు. వాటిని కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ప్రదర్శనకు ఉంచారు. డీఎస్సీ అభ్యర్థుల ఎంపిక జాబితాలను apdsc.apcfss.in వెబ్‌సైట్‌లో పొందుపరచినట్లు కాకినాడ డీఈవో పి.రమేష్ తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ మేనేజ్‌మెంట్లకు మొత్తం 1,241 ఉద్యోగాలను నోటిఫై చేయగా 1237మంది అభ్యర్థులు ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిలో 621మంది పురుషులు, 616మంది మహిళలు ఉన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ మేనేజ్‌మెంట్‌లో మొత్తం 112 ఉద్యోగాలను నోటిఫైచేయగా 112మంది ఎంపిక కాగా వారిలో పురుషులు 33మంది, మహిళలు 79మంది ఉన్నారని డీఈవో తెలిపారు. తుది ఎంపిక జాబితాలకు సంబందించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎంపికైన అభ్యర్థుల్లో ఏమైనా అభ్యంతరాలు కానీ, సందేహాలు కానీ ఉంటే తగిన ఆధారాలతో కాకినాడ డీఈవో కార్యాలయానికి వచ్చి నివృత్తి చేసుకోవచ్చని, 7989750963, 7799698462 నెంబర్లలో సంప్రదించవచ్చని డీఈవో సూచించారు.

కాకినాడలో సంగీత కచేరి

» పాటలతో అలరించిన ప్రముఖ గాయని కల్పన

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మాదిరెడ్డి సుబ్బారావు జయంతి సందర్భంగా కాకినాడ సూర్యకళా వ ం ది ర ం లో సోమవారం రాత్రి నిర్వహించిన సంగీత కచేరీ ప్రేక్షకులను అలరించింది. ప్రముఖ గాయని కల్పన పలు హిట్ చిత్రాల్లోని పాటలను ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. ఆమె గీతాలు ఆలపించినంత సేపు ప్రేక్షకులు మైమరచిపోయారు. కల్పనతో పాటు కాకినాడకు చెందిన గాయకుడు రమణ పలు చిత్రాల్లోని పాటలు ఆలపించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో సంగీత ప్రియులు పాల్గొన్నారు.


వీక్షిస్తున్న ప్రేక్షకులు


సంగీత కచేరిలో పాటలు పాడుతున్న గాయని కల్పన

భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి 7

'స్త్రీశక్తి' ఉచిత ప్రయాణాలకు సమయాలను మార్చుకోండి

» జిల్లా ప్రజారవాణా అధికారి శ్రీనివాస్

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, సాధారణ ప్రయాణికులతో ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 7గంటల వరకు బస్సులు చాలా రద్దీగా ఉంటున్న కారణంగా స్త్రీశక్తి పథకం కింద ప్రయాణించే మహిళలు తమ ప్రయాణ సమయాలను రద్దీ సమయాలకు అనుగుణంగా మార్చుకోవాలని జిల్లా ప్రజారవాణాధికారి శ్రీనివాస్ కోరుతూ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అందరికీ సరిపడేలా అన్ని రూట్లలో కొత్త బస్సులు పెంచే విధంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. అందువల్ల కొత్త బస్సులు వచ్చే వరకు విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు ఇతర ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా స్త్రీశక్తి పథకం కింద ప్రయాణించే మహిళలు తమ ప్రయాణ సమయాలను మార్చుకుని ఎవరికీ ఇబ్బంది లేకుండా ప్రయాణం చేయగలరని ఆయన కోరారు.

న్యూఢిల్లీ సదస్సులో గోకివాడ సర్పంచ్ 6

జిల్లాలో భారీ వర్షం

» కుండపోత వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం


కాకినాడ నగరంలో భారీగా కురుస్తున్న వర్షం

కాకినాడ, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం భారీ వర్షం కురిసింది. అల్పపీడనం ప్రభావంతో కొన్ని రోజులుగా జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఏకధాటిగా కురిసిన కుండపోత వర్షానికి జిల్లాలోని లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. రెండురోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండడంతో.. సోమవారం పరిస్థితి మారింది. మూడుగంటలపాటు కుండపోత వర్షం కురిసింది. కాకినాడలో అనేక కాలనీల్లో వర్షపునీరు చేరింది. నగరంలోని రామారావుపేట, సాంబమూర్తినగర్‌బ్రిడ్జి దిగువ వీధులు, రామకృష్ణారావుపేట, కచేరీపేట, ఎల్విన్‌పేట సమీపంలో గొల్లపేట, పాతబస్టాండ్ ఏరియా, జగన్నాథపురంలో రహదారులు నీటమునిగాయి.

పిఠాపురం, గొల్లప్రోలుల్లో భారీవర్షం

పిఠాపురం/గొల్లప్రోలు/కొత్తపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో కుండపోత వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం గంటన్నర పాటు కురిసిన భారీవర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. ఉప్పాడ సెంటర్, సినిమా సెంటర్, పాతబస్టాండు, అంబేడ్కర్‌సెంటర్, ఫైర్‌స్టేషన్, ప్రభుత్వాస్పత్రి, తహసీల్దారు కార్యాలయం సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్సు, చర్చి సెంటర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వర్షపునీరు ఉధృతంగా ప్రవహించింది. పాడా కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఉద్యోగి ఒకరు నీరు ప్రవహిస్తుండడంతో డ్రైను కనిపించక పడిపోగా సహచర ఉద్యోగులు బయటకు తీశారు. గొల్లప్రోలు పట్టణంలో సోమవారం భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో అడుగు ఎత్తున నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. కొత్తపల్లిలో సోమవారం కురిసిన భారీవర్షానికి ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి.


గొల్లప్రోలులో కురుస్తున్న భారీ వర్షం


పాడా కార్యాలయం వద్ద డ్రైన్‌లో పడిన ఉద్యోగిని లేపుతున్న సహచర ఉద్యోగులు

సామర్లకోటలో భారీ వర్షం

సామర్లకోట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణంలోను, మండలంలోనూ సోమవారం పిడుగులు, ఉరుములతో కూడిన భారీవర్షం కురిసింది. సామర్లకోటలోని పలు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. మురుగు నీరు రోడ్లపైకి ప్రవహించి రోడ్డు దుర్గంధంగా మారింది.

అర్జీలను సత్వరం పరిష్కరించాలి

» జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ),సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని జిల్లా రెవెన్యూఅధికారి వెంకట్రావు ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం ఇవ్వాలన్నారు. జిల్లాస్థాయి అధికారి ఆడిట్ చేసి నివేదిక పంపించిన తర్వాత వాటిని రాష్ట్రస్థాయిలో ఆడిట్‌కు పంపిస్తామన్నారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులో పేర్ల మార్పులు-చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఇళ్లస్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, భూముల రీ సర్వే, ఆక్రమణల తొలగింపు, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం, తల్లికి వందనంకు సంబంధించి 434 అర్జీలను స్వీకరించామన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు హాజరుకాలేని వారు మీ కోసం వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేయాలన్నారు. జడ్పీ సీఈవో లక్ష్మణరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసు, డీపీవో రవికుమార్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు రత్నమణి, శ్రీధర్, కలెక్టరేట్‌లోని పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో అర్జీలను స్వీకరిస్తున్న డీఆర్వో వెంకట్రావు

ఎస్పీ గ్రీవెన్స్‌కు 52 అర్జీలు: ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ పరిష్కారం కాక జిల్లావ్యాప్తంగా 52మంది అర్జీదారులు సోమవారం ఎస్పీ బిందుమాధవ్ నిర్వహించిన పోలీస్‌గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. ఈసందర్భంగా ఎస్పీ అర్జీదారుల సమక్షంలోనే సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి ఫిర్యాదులు సమ్మతమైనవైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి వేగవంతంగా దర్యాప్తు పూర్తిచేసి త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ఫిర్యాదుదారులు సంబంధిత పోలీస్‌స్టేషన్లలోను, సర్కిల్ కార్యాలయాల్లోను, సబ్‌డివిజన్ కార్యాలయాల్లోను ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆ ఫిర్యాదులను పోలీస్ గ్రీవెన్స్‌గానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేస్తామన్నారు.


అర్జీదారుల గోడు వింటున్న ఎస్పీ బిందుమాధవ్



సదస్సులో మాట్లాడుతున్న గోకివాడ సర్పంచ్ కీర్తి హరనాథబాబు

న్యూఢిల్లీ సదస్సులో గోకివాడ సర్పంచ్

గ్రామాల అభివృద్ధిపై చర్చ

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖలోని తాగునీరు, పారిశుధ్య విభాగాలు, క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా న్యూఢిల్లీలో ఆది, సోమవారాల్లో నిర్వహించిన సదస్సులో కాకినాడ జిల్లా పిఠాపురం మండలం గోకివాడ సర్పంచ్ కీర్తి హరనాథబాబు పాల్గొన్నారు. స్వచ్ఛ సుజల్, నారీబల్‌మిత్ర, సమృద్ధి, సురక్ష, సంపన్న పంచాయతీల ప్రాతిపదికన దేశ వ్యాప్తంగా ఉన్న 75 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లను ఈ సదస్సుకు ఆహ్వానించారు. గ్రామాల్లో తాగునీరు, సంపూర్ణ పారిశుధ్యం, అభివృద్ధి తదితర అంశాలపై సర్పంచ్ హరనాథబాబు మాట్లాడగా, మిగిలిన సర్పంచ్‌లు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ పాల్గొని సర్పంచ్‌లకు 100 రోజుల చాలెంజ్ కార్యక్రమంలో చేపట్టాల్సిన అంశాలను వివరించారు. గోకివాడ సర్పంచ్‌కు కేంద్రమంత్రి ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.



కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న సర్పంచ్ హరనాథబాబు



మహిళా ప్రతినిధులతో ఎమ్మెల్సీ పద్మశ్రీ

జాతీయ మహిళా సాధికారత సదస్సులో ఎమ్మెల్సీ పద్మశ్రీ

కాకినాడ సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్లో రెండో రోజులు జరిగిన జాతీయ మహిళా సాధికారిత సదస్సులో కాకినాడ నుంచి ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ప్రాతినిధ్యం వహించారు. సోమవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణసింగ్, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, పార్లమెంట్ మహిళా సాధికార కమిటీ చైర్‌పర్సన్ దగ్గుబాటి పురందేశ్వరి, రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి, ఏపీ శాసనసభ మహిళా కమిటీ చైర్‌పర్సన్ చరితారెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ పద్మశ్రీ మహిళా ప్రతినిధులతో పలు అంశాలపై చర్చించారు. ఈ సదస్సులో వివిధ రాష్ట్రాలకు చెందిన 120 మంది పాల్గొన్నారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పద్మశ్రీ

జిల్లాకు మరో తొమ్మిది పాల్ ల్యాబ్స్

- కోనసీమ జిల్లా సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి రాంబాబు



రాయవరం హైస్కూల్‌లో పాల్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఏఎంవో రాంబాబు

రాయవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు మరో తొమ్మిది పాల్ ల్యాబ్స్ (పర్సనలైజ్డ్ అసెస్‌మెంట్స్ లెర్నింగ్) మంజూరయ్యాయని, వీటిని ఉపాధ్యాయులంతా వినియోగించుకోవాలని సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పిల్లి రాంబాబు సూచించారు. సోమవారం రాయవరం శ్రీరామయ్య జడ్పీ హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాల్ ల్యాబ్స్ వినియోగించుకుంటున్న తీరుపై హెచ్ ఎం వీ.శాంతి సునీతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని 31 ఉన్నత పాఠశాలల్లో పాల్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


పల్ల వెంకన్న నర్సరీ సందర్శన



బర్నేకు మొక్కను అందజేస్తున్న నర్సరీ చైర్మన్ పల్ల సత్తిబాబు, డైరెక్టర్ పల్ల వెంకటేష్

కడియం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడియం పల్ల వెంకన్న నర్సరీని సోమవారం మహారాష్ట్ర శివసేన పార్లమెంటరీ చీఫ్ విప్, సౌర విద్యుత్ కేంద్ర కమిటీ సభ్యుడు, ఎంపీ రంగ్ అప్పా బర్నే సందర్శించారు. వారికి నర్సరీ చైర్మన్ పల్ల సత్తిబాబు, డైరెక్టర్లు వెంకటేష్, వినయ్ మొక్కను అందజేసి స్వాగతించారు. ఈ సందర్భంగా బర్నే మాట్లాడుతూ పిఠాపురం పాదగయకు వచ్చిన తాను కడియం వచ్చినట్లు తెలిపారు. నర్సరీలో దేశ, విదేశీ మొక్కలతో కూర్పు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తున్నాయన్నారు. సోలార్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు అందిస్తున్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జీవన ఎరువులతో యూరియాకు చెక్!



జీవన ఎరువుల డబ్బా

యూరియా దొరకదేమోనని
రైతులను వెంటాడుతున్న
భయం....
యూరియా కృత్రిమ కొరత
కొరతను అరికట్టేందుకు
అధికారుల పరుగులు...
యూరియా కొరత లేదంటున్న
అధికారులు....
కొరత ఉందంటూ
వైసీపీ నిరసనలు....
అసలు యూరియాకు అంత
డిమాండ్ ఏమిటి అన్న చర్చ
ప్రస్తుతం అందరిలోనూ
నడుస్తోంది.
యూరియాకు ప్రత్యామ్నాయం
ఏమీ లేదా అంటే
జీవన ఎరువులు ఉన్నాయని
ప్రకృతి వ్యవసాయ నిపుణుడు
అడ్డాల గోపాలకృష్ణ చెప్తున్నారు.
ప్రకృతి వ్యవసాయంతో ఎరువుల
వినియోగం తగ్గించడమే కాకుం
డా భూసారాన్ని ఎంతగానో పెం
పొందించవచ్చని ప్రకృతి వ్యవసా
యాధికారి శ్రీనివాస్ చెప్తున్నారు.





నానో ఎరువుల డబ్బాలు



యూరియా బస్తా

(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

యూరియా కొరత విషయంలో ధర కూడా ప్రభావం చూపిస్తుంది. యూరియా బస్తా ధర కేవలం రూ.267 మాత్రమే. కానీ యూరియా బస్తా ఒక్కింటికి కేంద్ర ప్రభుత్వం ఎంత రాయితీ ఇస్తుందో రైతు సంఘాల నాయకులు అందరికీ కూడా తెలియదు. యూరియా బస్తా ధర వాస్తవానికి రూ.1457.29. కాగా కేంద్రం ప్రభుత్వం 50 కిలోల యూరియా బస్తాకు రూ.1190.79 రాయితీ ఇస్తోంది. దాంతో రైతులకు ఒక్కో బస్తా రూ.267కే అందిస్తున్నారు. యూరియాకు రాయితీ ఉండడం, కాంప్లెక్సు ఎరువులకు లేకపోవడం కూడా ఇందుకు కారణం. యూరియా కలిసి ఉన్న కాంప్లెక్సు ఎరువుల బస్తా రూ.1,350 నుంచి పైమాటే. పంట పరిపూర్ణంగా ఎదిగేందుకు కాంప్లెక్సు ఎరువులు ఎంతో దోహదపడతాయని జిల్లా అధికారులు ప్రచారం చేసినా రైతులు మాత్రం యూరియాపైనే దృష్టి సారిస్తున్నారు. ఇక నానో ఎరువుల తయారీలో భాగంగా యూరియాను తక్కువ ధరకే సిద్ధం చేసిన తయారీదారులు తగినంత ప్రచారం లేకపోవడం, ఒక్కసారిగా రైతులు కొత్త విధానాన్ని అనుసరించకపోవడంకూడా ఇందుకు కారణం. ఇలా ఎన్నో కారణాలు ఉన్నాయి.

యూరియాకు ప్రత్యామ్నాయంగా జీవన ఎరువులు

యూరియాలో 90 శాతానికి పైగా నత్రజని ఉంటుంది.దానికి ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో లభించే జీవన ఎరువులు వినియోగించవచ్చని ప్రకృతి వ్యవసాయ నిపుణులు, అధికారులు చెప్తున్నారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా జీవన ఎరువులు అయిన రైజోబియం, అజతోబాక్టర్, అజస్పైరిల్లం, నీటి ఆకుపచ్చ నాచు వినియోగించడం ద్వారా భూమి సహజ స్వభావం దెబ్బతినకుండా నత్రజని శాతాన్ని పెంచవచ్చు.

తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు...


జీవన ఎరువులను వినియోగించడం ద్వారా నాణ్యమైన, ఆరోగ్యవంతమైన పంట దిగుబడులు సాధించవచ్చు. భూసారం మెరుగుపడుతుంది. జీవన ఎరువులు నత్రజనిని స్థిరీకరిస్తాయి. నేల ద్వారా సంక్రమించే తెగుళ్ల బెడద తగ్గి 10 నుంచి 20 శాతం దిగుబడి పెరుగుతుంది. పంట ఉత్పత్తుల్లో ఎక్కడా క్రిమిసంహారక మందుల అవశేషాలు ఉండవు. జీవన ఎరువులను ఒకసారి వినియోగిస్తే తదుపరి వాటంతట అవే వృద్ధి చెందుతాయి. తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులకు దోహదపడుతుంది.

రైజోబియం...

ఇది పైర్ల వేర్లపై బుడిపెలు కలుగజేసి సహజీవనం చేస్తూ గాలిలోని నత్రజనిని మొక్కలకు అందిస్తుంది. ఎకరాకు 40 కిలోల నత్రజని సహజసిద్ధంగా పైరుకు లభ్యం అవుతుంది. అదే విధంగా అజోస్పైరిల్లం, ఆకుపచ్చ నాచును వాడడం వల్ల పైరుకు, చేలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయి. రసాయన ఎరువుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

జీవన ఎరువులతో ప్రశాంతంగా సాగు

అడ్డాల గోపాలకృష్ణ, అమలాపురం



యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్న సంఘటనలు చూస్తున్నాం. కానీ జీవన ఎరువులు వినియోగించే రైతులు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ప్రశాంతంగా సాగు చేసుకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను మరింత ప్రోత్సహించడంతో పాటు ప్రత్యేక రాయితీలు కూడా కల్పించాలి. ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, మీనామృతం వంటివి మొక్కలకు నత్రజనిని అందించడంలో కీలకంగా పనిచేస్తాయి.

నూతన ఆవిష్కరణలు దిశగా సాగాలి

- అద్వికా-25లో నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నన్నయ జ్ఞానం, విశ్వేశ్వరయ్య శ్రద్ధ రెండింటి నుంచి ప్రేరణ పొంది నూతన ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని ఆదికవి నన్నయ వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో అద్విక-25 ఇంజనీరింగ్ ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన వీసీ ప్రసన్నశ్రీ, ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా నన్నయ విగ్రహానికి, మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ జాతినిర్మాణానికి విశ్వేశ్వరయ్య చేసిన అసమానమైన కృషిని నేడు అంతా అనుభవిస్తున్నారన్నారు. అనంతరం ఓరియంటేషన్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అద్విక ఉత్సవంలో విజేతలకు నగదు బహుమతి, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణ నీటిసరఫరా విభాగం ఈఈ బి.వెంకటగిరి, డీఈఈ టి.శ్రీనివాసబాబు, ఏఈ వి.అవినాష్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్‌కుమార్, ఈఈ రవికుమార్, ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్(ఐసీఐ) రాజమహేంద్రవరం సెంటర్ చీఫ్ కన్సల్టెంట్ కేవీ నరసింహారావు, ఓఎన్‌జీసీ విశ్రాంత ఈఈ జీవీఎస్ ప్రసాద్, ఇంజనీర్ హరికుమార్, విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ అధ్యాపకులు, ఇంజనీర్లను వీసీ సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ విద్యారులు, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూకే: భారత జాతి గర్వించదగ్గ వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కాకినాడ జేఎన్టీ యూ ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. యూసీఈకే సివిల్ ఇంజనీరింగ్ విభాగం డాక్టర్ కేఎల్ రావు సెమినార్ హాల్లో ఇంజనీర్ల దినోత్సవ వేడుకలను సోమవారం కె.పద్మకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి వీసీ ప్రసాద్, ప్రొఫెసర్లు ప్రసాదరాజు, మురళీకృష్ణ, ఉదయభాస్కర్,శ్రీనివాసులు, తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ నేటితరం ఇంజనీర్లు ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



వర్సిటీలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, తదితరులు

- 165వ ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా జేఎన్టీయూకే, ఐఈఐ కాకినాడ లోకల్ చాప్టర్, ఆర్ఐఈపీ ఆధ్వర్యంలో వర్సిటీలోని ఐఈ సెమినార్ హాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు ఏఐ, రోబోటిక్స్‌కి అనుకూలమైన ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలని సూచించారు.



కాకినాడలో మోక్షగుండం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వీసీ ప్రసాద్, ప్రొఫెసర్లు

నిలకడగా గోదావరి

- ధవళేశ్వరం వద్ద పెరుగుదల ..
- 5,54,609 క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద నీటితో ధవళేశ్వరం వద్ద నిదానంగా పెరుగుతోంది. సోమవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ నుంచి 5,5,609 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తుండగా, నీటిమట్టం 9.75 అడుగులుగా నమోదయ్యింది. ఎగువన భద్రాచలం వద్ద 39.60 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం నిలకడగా కొనసాగుతోంది. ఇదే ఒరవడి కొనసాగితే ధవళేశ్వరం వద్ద 6 లక్షల క్యూసెక్కులు వరకు తరలివచ్చి ఆపై నీటిమట్టం తగ్గవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ముగ్గురు ఎంపిక



పందలపాక నుంచి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బిక్కవోలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పందలపాక ఉన్నత పాఠశాల నుంచి అండర్-19 స్విమ్మింగ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. వీరు ఇటీవల కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారిలో సీహెచ్ కార్తీకసూర్య, ఎల్.సతీష్, జీ.దినేషవర్దన్ ఉన్నారన్నారు. ఎంపికైన విద్యార్థులను, పీడీ యువరాజారెడ్డిని హెచ్‌ఎంతో పాటు పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు, తదితరులు అభినందించారు.

క్యాన్సర్ మహమ్మారిని తరిమేద్దాం

- అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
- బలభద్రపురంలో మొదటి రోజు 169 మందికి స్క్రీనింగ్ పరీక్షలు

బిక్కవోలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురం నుంచి క్యాన్సర్ మహమ్మారిని తరిమేద్దామని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన గ్రామంలోని సచివాలయం-2లో బసవతారకం ఇండో- అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో స్క్రీనింగ్ పరీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో రంగరాయ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో 1,295 మందికి పరీక్షలు జరపగా, 65 మంది బాధితులు ఉన్నట్టు గుర్తించారని, దీంతో మిగతావారు భయపడి పరీక్షలు చేయించుకోలేదన్నారు. అలాంటి వారు సోమవారం 169 మంది స్క్రీనింగ్ టెస్టులకు హాజరయ్యారు. బసవతారకం ఆసుపత్రి నుంచి వచ్చిన వారిలో గైనకాలజిస్టులు డాక్టర్ శ్రావణకుమారి, డా. ప్రవళ్లిక, డా. రేణుక, రేడియాలజిస్ట్ డా. ప్రభాకర్, అంకాలజిస్ట్ డా. కృష్ణప్రసాద్‌లతో పాటు బిక్కవోలు, కొంకుదురు పీహెచ్‌సీ వైద్యులు డా. దుర్గాదేవి, డా. రుమన్, డా. విజయలక్ష్మి, డా.గణేష్‌పట్నాయక్ ఈ‌స్క్రీనింగ్ టెస్టులు జరిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ, ఏఎంసీ చైర్మన్ జుత్తుక సూర్యకుమారి, సొసైటి చైర్మన్ నల్లమిల్లి సుబ్బారెడ్డి, సర్పంచ్ బుంగా రామారావు, కూటమి నేతలు ఉన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

‘బాక్సింగ్’ పోటీల్లో మహాలక్ష్మికి గోల్డ్‌మెడల్

పిఠాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ కళాశాలల యూత్ బాక్సింగ్ అండర్-19 పోటీల్లో కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల బైపీసీ ఫస్టియర్ విద్యార్థిని పల్లా మహాలక్ష్మి గోల్డ్‌మెడల్ సాధించింది. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమెను, ఆమె తండ్రిని, కోచ్ పి.లక్ష్మణరావును ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కేశవరావు అభినందించారు. సీనియర్ అధ్యాపకులు డాక్టర్ శారద, అరుణ, చిన్నబ్బాయి, ఎస్‌కే హుస్సేన్, మొహిద్దీన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి దేవరపల్లి కాశీవిశ్వనాథం, ఆవీస్ ఇన్‌చార్జి పల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక

పిఠాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కాకినాడ జిల్లా పిఠాపురం బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్లస్ విద్యార్థినులు ఎంపికయ్యారు. కాకినాడ జిల్లా యోగా పోటీల్లో 8-14 సంవత్సరాల కేటగిరీలో పాఠశాలకు చెందిన కె.పవిత్ర (ప్రథమ), జీ.విజయప్రభ (ద్వితీయ), 14-18 సంవత్సరాల కేటగిరీలో కే.సమంత (తృతీయ) స్థానాల్లో నిలిచారు. వీరిని ఎంఈవో జీ.శ్యాంబాబు అభినందించారు. ఉపాధ్యాయులు లీలాదేవి, పద్మావతి, శ్రీవల్లి, పీడీ మంగాయమ్మ, పీఈటీ సత్యప్రియ పాల్గొన్నారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో శ్యాంబాబు

రైతుల కష్టాలు చెప్పుతున్నాయి!

యూరియా కోసం అర కిలోమీటరు క్యూ



ఎటపాక, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరత...దాని కోసం రైతులు పడుతున్న కష్టాలకు ఈ చిత్రాలే నిదర్శనం. అల్లూరి జిల్లా ఎటపాక మండలం తోటపల్లి రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. దీంతో చుట్టుపక్కల 10 గ్రామాలకు చెందిన రైతులు తెల్లవారుజామున 3 గంటలకే రైతు సేవా కేంద్రానికి వచ్చారు. యూరియా ఎరువులు పొందేందుకు తమ వంతుగా చెప్పులతో క్యూ కట్టారు. సుమారు అర కిలోమీటరు వరకు చెప్పులతో క్యూ కనిపించింది.

నేడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికలు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ మంగళవారం ఉదయం 9 గంటలకు జరుగుతాయని కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 బాలురు, బాలికలకు టెన్నిస్, జిమ్నాస్టిక్స్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థుల ఎలిజిబిలిటీ ఫార్మ్, మిడ్డే మీల్స్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు శ్రీనివాసరావు 9059317248, సుధారాణి 9603504337 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పులిమచ్చల టేకు చేప చిక్కింది..



అంతర్వేది, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సముద్రంపై వేటకు వెళ్లిన మత్స్యకారుల వలకు అరుదైన చేప చిక్కింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులకు సుమారు పది కిలోల పులిమచ్చల టేకు చేప పాట దొరకగా వేలం పాట నిర్వహించారు. దీనిని స్థానికులు వింతగా చూశారు. ఈ చేప పొట్ట భాగంలో, బ్లాడర్‌లో ఔషధ గుణాలు ఉండడంతో ఎక్కువగా మందుల తయారీలో ఉపయోగిస్తారని మత్స్యకారులు తెలిపారు. ఈ చేప ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రయాణిస్తూనే ఉంటుందని, అప్పుడప్పుడు వలకు చిక్కి అదృష్టం తెచ్చిపెడుతుందన్నారు.

అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులకు చిక్కిన పులిమచ్చల టేకు చేప

రూ.2.07 లక్షల విలువైన బాణసంచా సామగ్రి సీజ్



జొన్నాడలో సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్ఐ నరేష్

ఆలమూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ శివారు జాతీయ రహదారి సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన బాణసంచా సామగ్రిని ఆలమూరు పోలీసులు గుర్తించి సీజ్ చేశారు. ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జొన్నాడలో జాతీయ రహదారికి దగ్గరలో కొప్పుల సుధాకరరెడ్డి రేకులషెడ్డులో ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి రూ. 2,07,165 విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వివరించారు.

భవనం పైనుంచి పడి మహిళ మృతి



దుర్గ మృతదేహం వద్ద విలపిస్తున్న భర్త

కాకినాడ క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనం పై నుంచి పడి మహిళా కూలీ అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సోమవారం కాకినాడలో జరి గింది. వివరాలిలా ఉన్నాయి.. కాకినాడ పర్లోవపేటకు చెందిన రాగిని దుర్గ (37)కు భర్త ముసలయ్య, కుమార్తె సత్యవేణి ఉన్నారు. కాగా ముసలయ్య చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తుండగా అతడి భార్య దుర్గ కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు తాపీ పనుల్లో కూలీగా పని చేస్తుంది. ఈ క్రమంలో సోమవారం సాంబమూర్తినగర్ మూడోవీధిలో మహ్మద్ జానీకి చెందిన నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనంలో దుర్గ పనిచేస్తూ మూడో అంతస్తు పైకి ఇటుకలు మోస్తూ ప్రమాదవశాత్తు పై నుంచి కిందికి పడిపోయింది. తీవ్రగాయాల పాలైన దుర్గ అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న ఆమె భర్త ముసలయ్య రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. సమాచారం అందుకున్న త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

టీ తాగుతూ కుప్పకూలి మరణించిన కూలీ



సూర్యప్రకాశరావు (ఫైల్)

ప్రత్తిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలీ హోటల్ వద్ద టీ తాగుతూ కుప్ప కూలి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సోమవారం కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో జరిగింది. గ్రామానికి చెందిన బెంతుపల్లి సూర్యప్రకాశరావు (32) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం కూలీ పనులకు వెళ్లి హోటల్ వద్ద ఆగి టీ తాగుతూ గుండెపోటుతో వెనక్కి కుప్పకూలాడు. వెంటనే ప్రత్తిపాడు ఆ సుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. అతడి మృతితో భార్య గౌరి, పిల్లలు కన్నీరు మున్నీరయ్యారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

రాజానగరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు పరిధి ఆటోనగర్‌లోని ఒక మెకానిక్ షెడ్డులో గ్రీజు కొడుతుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతిచెందారు. రాజానగరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన కృష్ణకుమార్ సాకేత్(35) ఆటోనగర్ లోని మెకానిక్ షెడ్డులో 15 ఏళ్లుగా పనిచేస్తున్నాడు. భార్య, కుమారుడు, కుమార్తెతో కలిసి రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్నారు. సాకేత్ ప్రతిరోజూ ఆటోనగర్‌కు వెళ్తుంటాడు. సోమవారం మెకానిక్ షెడ్డుకు వెళ్లిన సాకేత్ మధ్యాహ్నం 3 గంటల సమయంలో గ్రీజు కొడుతుండగా ప్రమాదవశాత్తూ ఎలక్ట్రికల్ షాక్ గురై స్పృహ కోల్పోయాడు. దీంతో అతడిని చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెకానిక్ షెడ్డులో సూపర్ వైజర్ విక్రమ్‌సింగ్ ప్రమాద విషయాన్ని సాకేత్ భార్యకు ఫోన్ చేసి సమాచారం అందించారు. చికిత్స పొందుతూ సాకేత్ మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ ఎస్.ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

గండేపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామం అంబేడ్కర్ సెంటర్ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. గుర్తుతెలియని వృద్ధురాలు ఆదివారం రోడ్డుపై నడుచుకుని వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఆమెకు బలమైన గాయాలు కావడంతో వెంటనే స్థానికులు 108 ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. ఆమె గత కొంతకాలంగా మురారి పరిసర ప్రాంతాల్లో యాచన చేసుకుంటూ తిరుగుతున్నట్లు మురారి గ్రామస్థులు తెలిపారు. మేరకు గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు కేసు నమోదు చేశారు. వివరాలు తెలిస్తే 9440904841కు సమాచారం ఇవ్వాలని కోరారు.

రాజమహేంద్రవరం వద్ద వాన... / వానొచ్చే...



కాకినాడలో జోరుగా కురుస్తున్న వర్షం



సామర్లకోటలోని ఓ వీధిలో వర్షం నీరు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు వర్షంతో నీటితో నిండిపోయాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఆ దృశ్యాలే ఇవి





కాకినాడ సాంబమూర్తి నగర్‌లోని ఫ్లైఓవర్ పక్క వీధిలో వర్షపునీరు



పిఠాపురంలో కురుస్తున్న భారీ వర్షం



రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ రోడ్డులోని రైల్వే అండర్‌పాస్ వద్ద వర్షం నీటిలో వాహనదారుల ఇబ్బందులు

హుండీలు, మోటార్‌సైకిళ్ల చోరీ నిందితుడికి మూడేళ్ల జైలు, జరిమానా

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామంలోని పలు ఆలయాల్లోని హుండీలు, మోటార్ సైకిళ్లు చోరీ చేసిన నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ ప్రవీణ్‌కుమార్ సోమవారం తీర్పు వెలువరించినట్టు ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపారు. 2024 జూలై 23న టేకిలో జరిగిన చోరీ ఘటనలపై అప్పటి ఎస్ఐ వరదేశ కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో కెగెంగవరం మండలం తామరపల్లి గ్రామానికి చెందిన రేవు శ్రీనివాస్ అలియాస్ తాడే శ్రీనివాస్‌కు ఒక్కొక్క కేసులో మూడేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానాతో పాటు జరిమానా కట్టలేకపోతే అదనంగా 3 నెలల వరకు జైలుశిక్ష విధించినట్లు తీర్పు చెప్పారని పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ విల్ల శ్రీరాములు ప్రాసిక్యూషన్ తరుపున వాదించినట్టు ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపారు.

ఒమ్మంగిలో చోరీ

నగదు, వెండి, బంగారం మాయం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలో రూ.లక్ష నగదుతో పాటు వెండి, బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. దీనికి సంబంధించి బాధితురాలు గుండవరపు గని లక్ష్మి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన ఇంట్లోని బీరువా తెరిచి ఇంటి నిర్మాణం నిమిత్తం తీసుకున్న లోన్‌లో రూ.లక్ష నగదుతో పాటు విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు దుండగులు చోరీ చేశారని ఎస్ఐ లక్ష్మీకాంతం వద్ద వాపోయింది. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీఎల్‌పీవో కార్యాలయ ఏవోపై విచారణకు డీఆర్వో ఆదేశం

ఎస్సీ, బీసీ ఉద్యోగులపై తప్పుడు గ్రీవెన్స్ ఫిర్యాదులు చేయిస్తూ డబ్బులు డిమాండ్

విచారణ అధికారిగా సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ డీడీ శోభారాణి నియామకం

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో జిల్లా పంచాయతీ శాఖలో పనిచేస్తున్న పలువురు ఎస్సీ, బీసీ ఉద్యోగులపై తప్పుడు గ్రీవెన్స్ ఫిర్యాదులు చేయిస్తూ ఆ ఫిర్యాదులు క్లోజ్ చేయడానికి సదరు ఉద్యోగుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలపై కాకినాడ డీఎల్‌పీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఏవో సీహెచ్ వెంకటరెడ్డిపై వచ్చిన ఫిర్యాదుపై డీఆర్వో జె.వెంకట్రావు విచారణకు ఆదేశించారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కోఆర్డినేటర్ పి.వంగలరావు ఆధ్వర్యంలో పలు దళిత గిరిజన సంఘాల నాయకులు ఈ విషయంపై సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. చంగలరావు మాట్లాడుతూ యు.కొత్తపల్లి మండలం పొన్నాడ గ్రామ పంచాయతీకి సుమారు 3 నెలల క్రితం సియోన్‌కుమార్ అనే ఎస్సీ కులానికి చెందిన పంచాయతీ కార్యదర్శిని ట్రాన్స్‌ఫర్ ద్వారా నియమించడం జరిగిందన్నారు. అతను తమకు తెలిసినంత వరకు ఎంతో బాధ్యతగా పంచాయతీ శాఖ నిబంధనలకు లోబడి విధులను నిర్వహిస్తున్నాడన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పంచాయతీ సేవలను అందిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో పొన్నాడ పంచాయతీకి సంబంధంలేని నాగులపల్లి, కొండెవరం పంచాయతీలకు చెందిన బిళ్ల కుర్తి రామేశ్వరరెడ్డి, వాసంశెట్టి శ్రీను అకారణంగా అసత్య ఆరోపణలతో తరచూ జిల్లా కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో సియోన్‌కుమార్‌ను బదిలీ చేయాలని ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై సియోన్‌కుమార్‌ను అడగ్గా తనకు ఏ సమాచారం లేదని వారెవరో ఎందుకు ఫిర్యాదు చేస్తున్నారో తెలియదని చెప్పాడన్నారు. దీనిపై కొంచెం లోతుగా సమాచారం సేకరించగా కాకినాడ డీఎల్‌పీవో ఆఫీసులో ప్రస్తుతం ఏవోగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ వెంకటరెడ్డి ఇద్దరితో ఫిర్యాదు చేయించాడని తెలిసిందన్నారు. గతంలో కూడా వెంకటరెడ్డిపై అనేక అవినీతి ఆరోపణలు, నిధుల దుర్వినియోగంపై సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. 12వ ఆర్థిక సంఘం నిధుల తాలూకా వడ్డీని తన ఖాతాకు మళ్లించుకున్నాడని, అతడి సర్వీసులో ఉండగా చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు తిరిగి ఉద్యోగం ఇప్పించే విషయంలో బెనిఫిట్స్ ఇచ్చే విషయంలో మహిళలను కావాలని ఉద్దేశపూర్వకంగా తన చుట్టూ తిప్పుకుంటూ నచ్చినవారిపై లైంగిక వేధింపులు కూడా చేస్తుంటాడని తెలిసిందన్నారు. ఎస్సీ బీసీ ఉద్యోగులను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటాడన్నారు. సీహెచ్ వెంకటరెడ్డి, అతడి అనుచరులు బిళ్లకుర్తి రామేశ్వరరెడ్డి, వాసంశెట్టి శ్రీనివాస్‌లపై డిపార్టుమెంటల్ ఎంక్వైరీ జరిపించాలన్నారు. వెంకటరెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై డీఆర్వో జె.వెంకట్రావు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణిని విచారణ అధికారిగా నియమించారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు, జై భీమ్‌రావు భారత్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ ఏసుపల్లి కృష్ణ, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాత సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మాజీ క్రికెటర్ కన్నుమూత

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన మాజీ రంజీ ట్రోఫీ క్రికెటర్ ఎస్.సత్యదేవ్ (84) శనివారం రాత్రి కాకినాడలో అనారోగ్య సమస్యల కారణంగా కన్నుమూశారు. సత్యదేవ్ ఆల్‌రౌండర్. లెగ్ స్పిన్‌తో పాటు గూగ్లీ బౌలింగ్ చేసేవారు. 1964-65 సీజన్‌లో విశాఖపట్నం, హైదరాబాద్‌లో జరిగిన రంజీ మ్యాచ్‌లో అరంగేట్రం చేశారు. 1968-69 సీజన్‌లో తిరుచ్చిలో మద్రాస్ (తమిళనాడు)తో జరిగిన చివరి మ్యాచ్ ఆడారు. సత్యదేవ్ 16 మ్యాచ్‌లు ఆడి 503 పరుగులు చేశారు. ఒక సెంచరీ కూడా ఉంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి అధికారిగా పదవీ విరమణ చేశారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ సానా సతీష్‌బాబు, తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ నక్కా వెంకటేష్ ప్రగాఢ సంతాపం తెలిపారు.

భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి

లోతట్టు ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలి : చింతూరు ఐటీడీఏ పీవో


చింతూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరి క్రమంగా పెరుగుతోంది. సోమవారం రాత్రి 7 గంటలకు భద్రాచలం వద్ద 39.60 అడుగుల మేర ప్రవహిస్తోంది. ఈ క్రమంలో చింతూరు మండలం, చింతూరు వరరామచంద్రపురం మండలాల నడుమ సోకిలేరు వాగు మీద ఉన్న చప్టాను ఆనుకుని ఏపోపోటు వరద ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొఖ్వాల్ ప్రకటన విడుదల చేశారు. లోతట్టు ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని, ఐటీడీఏలో వరద కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కూనవరం మండలం, కొండ్రాజుపేట, టేకులబోరు గ్రామాల నడుమ రహదారిపై వరద నీరు చేరిందని, జాలర్లు చేపల వేటకు వెళ్లవద్దని పీవో పేర్కొన్నారు.

అర్ధరాత్రి హాహాకారాలు..!

పెట్రోల్, డీజిల్‌తో ఫ్లాట్‌కి నిప్పుపెట్టిన వైనం

అర్ధనాదాలతో ప్రాణాలతో బయటపడిన కుటుంబ సభ్యులు

కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలో ఘటన



ఫ్లాట్‌లో దగ్ధమైన ఫర్నీచర్

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలో దారుణం జరిగింది. పెట్రోలు, డీజిల్ పోసి ఫ్లాటుకి నిప్పు పెట్టడమే కాకుండా ఇంట్లో ఉన్న వారిని అగ్నికి ఆహుతి చేసేందుకు యత్నించిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఈ ఉదంతంపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంచలనం రేకెత్తింది. వ్యక్తిగత కక్ష, ఆర్థిక లావాదేవీలే కారణంగా పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. వివరాల్లోకి వెళితే కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట పంచాయతీ పరిధి ఆర్యాపురం సమీపంలో గల గోపీకృష్ణా రెసిడెన్సీలో మెకానిక్ పిల్లి సత్తిబాబు, భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు నివసిస్తున్నారు. వారంతా భోజనం చేసి ఆదివారం రాత్రి 12 గంటల తర్వాత పడుకున్నారు. సుమారు అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో గదిలో నుంచి పెట్రోలు, డీజిల్ వాసన రావడం, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందిగా ఉండడంతో మెలకువ వచ్చి సత్తిబాబు లేచి పరిశీలించగా, పెట్రోలు, డీజిల్ వాసనతో పాటు మంటలు రావడాన్ని గుర్తించి కుటుంబ సభ్యులను లేపి తలుపులు తీసేందుకు ప్రయత్నించాడు. మంటలతో వీరి హాహాకారాలను గుర్తించిన సమీప ఫ్లాట్స్ వాసులు వచ్చి ఇంటి తలుపులు, అద్దాలు బద్దలు కొట్టి ఆతికష్టంపై సత్తిబాబు, భార్య దుర్గ, బాలికలు సృజన, భానుచంద్రిక, ఆరేళ్ల మణికార్తీక్‌లు బయటకు ప్రాణాలతో తీసుకురాగలిగారు. మంటల్లో గదుల్లో ఉన్న ఫర్నీచర్, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంపై స్థానికులు ఫైర్ అధికారులకు సమాచారం ఇవ్వగా హుటాహుటిన అగ్నిమాపక వాహనంపై సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తేవడంతో పక్క పోర్షన్‌లకు పెను ప్రమాదం తప్పింది. గ్యాస్ సిలిండర్ పేలి ఉంటే మరింత ప్రమాదం వాటిల్లి ఉండేది. తాము నివసిస్తోన్న అపార్టుమెంట్ పెంట హౌస్‌లో నివాసం ఉంటున్న ఒక వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ బాధితుడు పిల్లి సత్తిబాబు సర్పవరం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. సర్పవరం సీఐ బీగోపిచందర్‌రావు ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు ఇచ్చిన సమాచారం మేరకు సదరు వ్యక్తితో వ్యక్తిగత, ఆర్థిక లావాదేవీలపై పలుసార్లు తగాదాలు పడినట్టు భావిస్తున్నామన్నారు. పలు కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇంతటి దుశ్చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా పోలీసులు అపార్టుమెంట్ పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టారు. ఈ ఘటనతో ప్రజలంతా తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ప్రజా వినతులను సత్వరం పరిష్కరించాలి

పిఠాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల వినతులను సత్వరం పరిష్కరించాలని పాడా ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాలరావు అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వివిధ వర్గాల ప్రజల నుంచి 43 అర్జీలు అందాయి. అర్జీదారులు తమ వినతి లేదా ఫిర్యాదు స్థితిగతులను టోల్‌ఫ్రీ నెంబరు 1100కు ఫోను చేసి తెలుసుకోవచ్చు. మునిసిపల్ కమిషనరు నామ కనకారావు, తహసీల్దారు పీవీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సమిష్టి కృషితో పెద్దాపురం మండల అభివృద్ధి

పెద్దాపురం మండల సమావేశంలో ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమిష్టి కృషితోనే మండల అభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పెద్దాపురం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలంటే అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం ఎంతో అవసరమన్నారు. ఏడాది కాలంలో సుమారు రూ.100 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మొయిళ్ల కృష్ణమూర్తి మాట్లాడుతూ మండల సమావేశానికి హాజరుకాని అధికారులకు నోటీసులు జారీ చేయాలన్నారు. అనంతరం పలు సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పలు సమస్యలపై చర్చించారు.

డీఎల్డీవోగా ఉద్యోగోన్నతిపై విశాఖ జిల్లాకు వెళ్తున్న ఎంపీడీవో డి.శ్రీలలితను ఎమ్మెల్యే చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ఘనంగా సత్కరించారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నూనె మంగలక్ష్మిరామారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


మెహెర్ కాంప్లెక్స్ వద్ద యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

సామర్లకోట చేరుకున్న యూటీఎఫ్ 'రణభేరి' జాతా

సామర్లకోట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఆర్థిక, విద్యారంగ సమస్యలపై రణభేరి జాతర సోమవారం సామర్లకోట చేరుకుంది. తుని, ఏలేశ్వరం నుంచి సుమారు 100 వాహనాల్లో ఉపాధ్యాయులు తమ ప్రధాన డిమాండ్లతో నినాదాలు చేస్తూ ప్రదర్శనగా సామర్లకోట తరలి వచ్చారు. వారికి మెహెర్ కాంప్లెక్స్ వద్ద సామర్లకోట పట్టణ శాఖ తరపున గౌరవాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, గణేష్, ఎం.నాగేశ్వరరావు, వీరన్న, త్రిమూర్తులు, నాగకృష్ణ ఘన స్వాగతం పలికారు. అనంతరం తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బుర్రా గోపీమూర్తి యూటీఎఫ్ పతాకావిష్కరణ చేశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలపై పలువురు మాట్లాడారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.రవిచక్రవర్తి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, సూరిబాబు, జిల్లా బాధ్యులు వీరబాబు, పి.గిరిధరగోపాలరావు, కేవీవీ సత్యనారాయణ, పీవీవీ సత్యనారాయణ, సీతారామరాజు, గణేష్, సీహెచ్‌వీ రమణ, సోనీ, జి.ప్రభాకరవర్మ తదితరులు పాల్గొన్నారు.

ఐదు వేల మందికి అన్నదానం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని సాంబమూర్తినగర్‌లోని శ్రీవిజయ గణపతి మందిరం కమిటీ అధ్యక్షుడు గాది శివరామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఐదు వేల మందికి అన్నదానం చేశారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నదానాన్ని ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ వొమ్మి బాలాజీ, తుమ్మల రమేష్, బలసాడి రంగారావు, చింతలపూడి రవి, బాసి రమణ, జారు ఖాన్, జి.రాంబాబు, పి.భద్రరావు, దారప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. జీజీహెచ్ వెనుక అవసరాల వారి వీధిలోని విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద బోయి రెడ్డి ఆధ్వర్యంలో రెండువేల మందికి అన్నదానం చేశారు. అతిథులుగా హాజరైన 36వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్, తులసి అన్నదానం నిమిత్తం రూ.5వేలు విరాళం అందజేశారు. నల్లూరి దంపతులను బాలమిత్ర బృందం సభ్యులు శాలువాతో సత్కరించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న సిటీ ఎమ్మెల్యే కొండబాబు

స్మార్ట్ సిటీ ల్యాబ్ ప్రారంభం

కాకినాడ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ సిటీ ల్యాబ్ ఏర్పాటుతో అత్యాధునిక పరిశోధనలు, ఆవిష్కరణలకు మార్గం సుగమమవుతుందని హైదరాబాద్‌లోని ఐఐఐటీ స్మార్ట్ సిటీ ల్యాబ్ ప్రిన్సిపల్ ఆర్కిటెక్ట్ అనురాధ వట్టెం అన్నారు. ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా కైట్, ఐఐఐటీ హైదరాబాద్‌లోని స్మార్ట్ సిటీ పరిశోధనా కేంద్రం సంయుక్తంగా ఏర్పాటుచేసిన స్మార్ట్ సిటీ ల్యాబ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కైట్ విద్యార్థులు ఇప్పటికే ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ సిస్టమ్ అభివృద్ధి చేసి క్యాంపస్‌లో అమలు చేశారన్నారు. ఈ ల్యాబ్ భవిష్యత్తులో హోమ్ ఆటోమేషన్, వాటర్ మేనేజ్‌మెంట్, ఎనర్జీ ఆప్టిమైజేషన్ స్మార్ట్ మొబిలిటీ వంటి విభాగాల్లో పలు ప్రాజెక్టులకు కేంద్రంగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఆప్టాబ్, కైట్, రాజీవ్ గాంధీ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ పోతుల విశ్వం, శ్రీమహావిష్ణు, డైరెక్టర్ ఐశ్వర్య, ప్రిన్సిపాల్స్ రేవతి, రామకృష్ణ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


స్మార్ట్ సిటీ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ ఆర్కిటెక్ట్ అనురాధ

రవికి ఆస్ట్రో జెమ్ అవార్డు

గొల్లప్రోలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు అనిశెట్టి రవీంద్ర సత్యప్రసాద్ (రవి)కి ఆస్ట్రోజెమ్ అవార్డు లభించింది. హైదరాబాద్‌కు చెందిన విశ్వజ్యోతి జ్యోతిష విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఉభయ తెలుగు రాష్ట్రాల వాస్తు, జ్యోతిష్య గ్రంథ రచయితల సమ్మేళనం జరిగింది. విశిష్ట సేవలు అందిస్తున్న రవిని ఆస్ట్రోజెమ్ అవార్డుతో బహు గ్రంథ రచయితలు పుచ్చా శ్రీనివాసరావు, పాలపర్తి శ్రీనివాసశర్మ, ఆకుల రామచంద్రరావు, విశాఖ చాప్టర్ అధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాసరావు సత్కరించారు. రవి ఉచితంగా అందిస్తున్న సేవలు, అవగాహన కార్యక్రమాలను వారు అభినందించారు.


రవిని ఆస్ట్రో జెమ్ అవార్డుతో సత్కరిస్తున్న జ్యోతిష విజ్ఞాన సంస్థ ప్రతినిధులు

'పాడి పశువులకు గాలికుంటువ్యాధి టీకా వేయించాలి'

కొత్తపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను పాడి పశువులకు తప్పక వేయించాలని కొత్తపల్లి వెటర్నరీ డాక్టర్ శ్రీమన్నారాయణమూర్తి రైతులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక పశువుల ఆసుపత్రిలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. నాగులాపల్లి, కొమరగిరి పశువైద్యులు హిమజ, ప్రత్యూష పాల్గొన్నారు. శ్రీమన్నారాయణమూర్తి మాట్లాడుతూ మండలంలో మూడు బృందాలు ఏర్పాటుచేసి వ్యాధి నిరోధక టీకాలు వేస్తామన్నారు.

రైతులకు యూరియా అందుబాటులోకి తీసుకురావాలి

కొత్తపల్లి మండల సమావేశంలో వైస్ ఎంపీపీ డిమాండ్


యూరియా సరఫరాపై వ్యవసాయ శాఖ అధికారిని ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ సురేష్‌కుమార్

కొత్తపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ యేడాది సార్వా సీజన్లో యూరియా సక్రమంగా అందుబాటులో లేక రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారికి యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కొత్తపల్లి వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ కారే సుధా శ్రీనివాసరావు అధ్యక్షన సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, ఎంపీడీవో ఎ.లక్ష్మీరెడ్డి, తహసీల్దారు జి.చిన్నారావు పాల్గొన్నారు. వ్యవసాయాధికారి వి.జోగిరాజు మాట్లాడుతూ మండలానికి 525 టన్నుల యూరియా అవసరం కాగా 725 టన్నులు మంజూరైందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు యూరియా దొరకడం కష్టంగా మారిందన్నారు. ప్రైవేటు దుకాణాల్లో రూ.270 యూరియా బస్తాను రూ.400కు విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారని వైస్ ఎంపీపీ ఆరోపించారు. కొరత లేకుండా బ్లాక్ చేయకుండా యూరియా సరఫరా చేయాలని వ్యవసాయాధికారికి విజ్ఞప్తి చేశారు. పీఎం సూర్యఘర్ పథకంలో రాయితీపై సోలార్ ప్యానెల్స్ మంజూరు చేస్తారని, అవసరమైన వినియోగదారులు పేర్లు నమోదు చేయించుకోవాలని విద్యుత్ శాఖ ఏఈఈ ఎం.శ్రీనివాసరావు కోరారు. గృహ వినియోగదారులు రాయితీపై లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. కిలో వాట్‌కు రూ.వెయ్యి చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. కొండెవరం జోగిరాజుపేటలో ఇళ్లపై నుంచి వెళ్లే అధిక విద్యుత్ తీగలను మార్పు చేయాలని ఎంపీటీసీ దుళ్ల సత్తిబాబు, ఉప్పాడ తీర ప్రాంతంలో రోడ్డుపై వాలిపోతున్న తీగలను సరి చేయాలని ఎంపీటీసీ మేరుగు ఎల్లాజీ... ఏఈఈ శ్రీనివాసరావుకు విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు పిల్లలను వేరే పాఠశాలలలో చేర్పించేటప్పుడు తరగతి, పుట్టిన తేదీ మార్చకుండా చేర్పిస్తే తల్లికి వందనం మంజూరులో ఇబ్బందులు ఉండవని ఎంఈవో బుర్రా వేణుగోపాల్ తెలిపారు.

సమావేశంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో గున్నాబత్తుల కొండలరావు, ఐకేపీ ఏపీఎం కలమటతవుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సారమ్మ తదితరులు మాట్లాడారు.

తాగునీటి ఇబ్బందులు వేసవిని తలపిస్తున్నాయి

కాజులూరు మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం


కాజులూరు మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాంబాబు

కాజులూరు (కరప), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సోమవారం ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన కరప మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండల స్థాయి అధికారులు తమ శాఖల ద్వారా గత మూడు నెలల కాలంలో మండలంలో జరిగిన ప్రగతిని, సంక్షేమ పథకాలను సభ్యులకు వివరించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఒంటితాడి, శీల, మతుకుమిల్లి గ్రామాల సర్పంచ్‌లు నెల్లి బ్రహ్మజీ, కొమలి వెంకటరమణ, పట్టా వీరబాబు, ఇతర సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు వేసవిని తలపిస్తున్నా అధికారులు పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారానికి ఒక్కసారి కూడా నీటిని సరఫరా చేయట్లేదని, అరకొరగా అందించే తాగునీరు అపరిశుభ్రంగా ఉంటోందని నిలదీశారు. ట్యాంకుల్లో నాచు పెరిగి ఫిల్టర్ బెడ్లు పనిచేయట్లేదని, కాంట్రాక్టర్ అందుబాటులో లేక నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రూప సభ్యులకు వివరించారు. రెండు, మూడు రోజుల్లో తాగునీటి ఇబ్బందులను తొలగిస్తామని హామీ ఇవ్వడంతో సభ్యులు శాంతించారు. ఎరువుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పీఏసీఎస్‌లకు వచ్చిన ఎరువులను సిబ్బంది బ్లాక్ చేసి మార్కెట్లో అధిక ధరకు అమ్ముతున్నారని మంజేరు సర్పంచ్ గుంటూరి అప్పారావు ఆరోపించారు. ఏవో పి.అశోక్ మాట్లాడుతూ ఎరువులు ఎక్కడా దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సాగునీటి సమస్య, హౌసింగ్ బిల్లులు, రోడ్లు, విద్యుత్ సమస్యలపై సభ్యులు గళమెత్తారు. ఆయా శాఖల అధికారులు స్పందించి పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీలు పెద్దిరెడ్డి వెంకటరమణ, రేఖాడి విజయ, ఎంపీడీవో జె.రాంబాబు, తహసీల్దారు రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.


జిల్లా, మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కరప, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో సోమవారం మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు కె.దేవిసునందకుమారి, కరప మండల ఉత్తమ ఉపాధ్యాయురాలు వి.వీరభద్రావతి, ఉత్తమ స్కూల్ అసిస్టెంట్ వి.లక్ష్మీనారాయణ, పెద్దాపురప్పాడు, కరప, గురజనాపల్లి, వేళంగి క్లస్టర్ల ఉత్తమ ఉపాధ్యాయులు జె.దీవెన కుమారి, ఎన్ఎస్ఎస్ఎస్ విశ్వేశ్వరరావు, ఎ.ప్రసాద్, ఎస్.తనూజ, బెస్ట్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కేటగిరీలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన కె.వెంకటరమణ, బెస్ట్ ఎంప్లాయ్ కేటగిరీలో ఎంఈవో కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ వీఏఎల్ సత్యవతిలను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణి, ఎంఈవో-2 పత్తి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు బండారు మురళి, దేవు వెంకటేశ్వరరావు, ముద్రగడ రమేష్, బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, రెడ్డిపల్లి నారాయణరావు, తుమ్మలపల్లి మాచరరావు, దూడల నారాయుడు, వెలుగుబంట్ల సూరిబాబు, సైనవరపు భవానీశంకర్, మెండు గోవిందు, యాళ్ల పండు, పేకేటి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



యోగా పోటీల్లో పతకాలు సాధించిన మాధవపట్నం విద్యార్థులు

యోగా పోటీల్లో మాధవపట్నం విద్యార్థుల ప్రతిభ

సామర్లకోట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో పిఠాపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో మాధవపట్నం విద్యార్థులు వాసంశెట్టి వీరబాబు (బంగారు), రాయుడు లక్ష్మి, అనుసూరి లోవకుమారి (రజత), బొందల భవాని, వల్లూరి బాబు, వీరాంజనేయులు (కాంస్య) పతకాలు సాధించారు. ఈ నెల 25, 26 తేదీల్లో విశాఖలో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు అర్హత సాధించారు. వీరిని సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే వెంకటేష్, మేడిశెట్టి నానిబాబు, పిల్లి కళ్యాణ్, రాయుడు సూరిబాబు, పెంకే శివరామకృష్ణ, బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జి విత్తనాల వెంకటరమణ అభినందించారు.

యూరియా కోసం బారులు

పిఠాపురంలో రైతుల మధ్య వాగ్వాదం

జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దిన పోలీసులు

పిఠాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతుల యూరియా కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించట్లేదు. పిఠాపురంలో షాపుల వద్ద రైతులు బారులు తీరారు. గంటలకొద్దీ వేచి చూడాల్సి రావడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు రైతుల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకోగా పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

పిఠాపురం పట్టణంలోని మన గ్రోమోర్‌కు యూరియా నిల్వలు వచ్చాయన్న సమాచారంతో సోమవారం రైతులు అక్కడకు భారీగా చేరుకున్నారు. గంటల తరబడి క్యూలో ఉన్నా యూరియా లభించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షంలోనే రైతులు ఎదురుచూపులు చూశారు. ప్రతి రైతు బయోమెట్రిక్ తీసుకున్న తర్వాతే యూరియా పంపిణీ చేయాల్సి రావడంతో తీవ్ర జాప్యం చోటు చేసుకుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు లైనులో ఉంటే ఒక బస్తా యూరియా లభించిందని రైతులు తెలిపారు. పిఠాపురం పట్టణంలో అగ్రహారం సొసైటీ, ఎఫ్ఎస్‌సీఎస్ ఉన్నప్పటికీ వాటికి యూరియా కేటాయించకుండా ప్రైవేటు దుకాణాలకే కేటాయించడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల అవసరాలకు సరిపడా యూరియాను ఒకేసారి సరఫరా చేస్తే ఈ ఇబ్బంది ఉండదని వారు తెలిపారు. రైతులు మధ్య పలుమార్లు వాగ్వాదాలు జరిగి స్వల్ప తోపులాటలు చోటు చేసుకున్నాయి. పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

అదనపు కమిషనర్ సుధాకర్

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే అర్జీల పరిష్కారానికి సత్వరం చొరవ చూపాలని అదనపు కమిషనరు కేటీ సుధాకర్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించిన 'డయల్ యువర్ కమిషనర్'కు ఏడుగురు ఫోను చేసి సమస్యలు తెలిపారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో 13కిపైగా అర్జీలు అందాయి. ఎస్ఈ పి.వెంకటరావు, డీసీపీ కృష్ణారావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్, టీపీఆర్వో శైలజ, ఈఈలు కామేశ్వరరావు, మాచిరాజు, ఏసీపీ శ్రీధర్, మేనేజర్ సీతారాం, అకౌంటెంట్ రామశాస్త్రి, ఆర్వో శిరీష్ పాల్గొన్నారు.

'రాజ్యాంగ ప్రజాస్వామిక హక్కులను కాపాడాలి'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ ప్రజాస్వామిక హక్కులను కాపాడాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. సీఐటీయూ నగర కన్వీనర్ మలక వెంకటరమణ అధ్యక్షత వహించగా వేదిక కన్వీనర్ అయితాబత్తుల రామేశ్వరరావు, న్యాయవాది ఎండీ జవహర్ అలీ, నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ యునైటెడ్ ఫోరం నాయకుడు టి.నూకరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జీ ప్రసంగించారు. కాశి బాలయ్య, మేడిశెట్టి వెంకట రమణ, పలివెల వీరబాబు, సీహెచ్ విజయ కుమార్, కె.నాగజ్యోతి, టి.రాణి తదితరులు పాల్గొన్నారు.

'బ్లూ ఓషియన్ బయోటెక్ కార్మికుల ఉపాధి కాపాడాలి'

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బ్లూ ఓషియన్ బయోటెక్ పరిశ్రమ మూసివేతను అడ్డుకుని కార్మికుల ఉపాధి కాపాడాలని కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ పెద్దాపురం మండలం జి.రాగంపేటలో గల బ్లూ ఓషియన్ బయోటెక్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమను మూసివేసి 78 కార్మికులను విధుల నుంచి తొలగించారన్నారు. దీంతో 12 ఏళ్లుగా దీన్నే నమ్ముకుని బతుకుతున్న కార్మికులు వీధిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కల్పించుకుని మూతపడుతున్న పరిశ్రమను తెరిపించాలని డిమాండ్ చేశారు. జి.లోకేష్, కె.దుర్గాప్రసాద్, ఎ.త్రిమూర్తులు, జె.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, పి.గోపాలకృష్ణ పాల్గొన్నారు.


సామర్లకోట మండలం కొప్పవరంలో సీఎం ఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజప్ప

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

సామర్లకోట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట ఏడీబీ రోడ్డులోని కొప్పవరంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు క్యాంపు కార్యాలయంలో సోమ వారం ఐదుగురు లబ్ధిదారులకు రూ.7.95 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పంపిణీ చేశారు. కార్యాలయ ఇన్చార్జి మేకా లక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తోట నవీన్, నులుకుర్తి వెంకటేశ్వరరావు, ముత్యాల అనిల్, తలాటం హరీష్, జున్నూరు బాబ్జీ, ఆనంద్‌న్యూటన్ తదితరులు పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములవాడలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి-సత్యనారాయణమూర్తి దంపతులు టీడీపీ నాయకులతో కలిసి పర్యటించారు. కేన్సర్‌తో మృతి చెందిన వాసంశెట్టి శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించి రూ.1.05లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. పలు గ్రామాల్లో ప్రమాదవశాత్తు మరణించిన గుత్తుల సత్యనారాయణ కుటుంబానికి రూ.2లక్షలు, అనారోగ్యంతో మరణించిన సీనియర్ జర్నలిస్ట్ జీవన్ కుటుంబానికిరూ. 2,14,632 సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. వినికిడి సమస్యతో బాధపడుతున్న గుత్తుల మంగయ్యమ్మకు పిల్లి దంపతులు వ్యక్తిగతంగా రూ.30వేలు విలువచేసే మిషన్ అందజేశారు. మాజీ జడ్పీటీసీ బుంగా సింహాద్రి, వాసంశెట్టి బుజ్జి, నాగం బాబులు, వాసంశెట్టి నారాయుడు పాల్గొన్నారు.


కరప మండలం వేములవాడలో...

'నారీ పరివార్'పై అవగాహన

శంఖవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఈనెల17నుంచి అక్టోబరు వరకు ఆరోగ్యశాఖ నిర్వహించే స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ పరివార్ అభియాన్ విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి శెట్టిబత్తుల శ్రీరామ్ రాజీవ్‌కుమార్ అన్నారు. శంఖవరం ప్రాథమికఆరోగ్య కేంద్రంలో సోమవారం అవగాహన నిర్వహించారు. మండలంలోని ఆసుపత్రి, సబ్ సెంటర్, ఆరోగ్య మందిరాల్లో శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బీపీ, రక్తహీనత, షుగర్ తదితర పరీక్షలు చేస్తారని తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 70 అర్జీలు

రంపచోడవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్, ఏపీవో(జీ) డీఎన్వీ రమణ, డీడీ రుక్మాండయ్య, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపానాధికారి ఎం.సావిత్రి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. గ్రీవెన్స్‌లో 70 అర్జీలు అందాయని, వాటిని పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

మంజూరైన పనులు పూర్తి చేయాలి: పీవో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మంజూరైన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని పీవో స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో వివిధ శాఖల సెక్టార్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఎం జన్మన్ పథకం ద్వారా వెనుకబడిన గిరిజనులకు మంజూరైన గృహాల స్థితిగతులపై మండలాల వారీగా సమీక్షించారు. జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లను పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమాల్లో డీడీ షరీఫ్, డీఎల్డీవో కె.కోటేశ్వరరావు, పీహెచ్‌వో దేవదానం, ఏడీఏ కె.సావిత్రి, డీఈవో వై.మల్లేశ్వరరావు, ఈఈలు, ఏడీఏలు, డీఈఈలు పి.వెంకటరమణ, శివ, సుబ్బారావు, రమేష్, ఏడీఎంహెచ్‌వో తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చింతూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ అన్నారు. సోమవారం మండలంలోని 23 చెరువులు, నీటి కుంటల్లో 30 వేల గంబూషియా చేపల్ని విడిచారు. చింతూరులో చేపట్టిన కార్యక్రమంలో పీవో పాల్గొన్నారు. మలేరియా నియంత్రణలో భాగంగా గంబూషియా చేపల్ని నీటి కుంటల్లో విడిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీడీఎంహెచ్‌వో డా. పుల్లయ్య, తులసిపాకల పీహెచ్‌సీ నిఖిల్, హెచ్‌ఈవో రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే

మోతుగూడెం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పరిధిలో పొల్లూరు జల విద్యుత్ కేంద్రం ఆవరణలో ఇంజనీర్స్ డే నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి చీఫ్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, ఈఈ వరప్రసాద్ నివాళులర్పించారు. పటిష్ఠమైన ఇంజనీరింగ్ విధానంతో విశ్వేశ్వరయ్య దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. కార్యక్రమంలో ఏడీలు, ఇంజనీర్స్, పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు

ముంపు బారి నుంచి కాపాడండి

దేవీపట్నం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండిపోశమ్మతల్లి ఆలయాన్ని పోలవరం ముంపు నుంచి కాపాడి అభివృద్ధి చేయాలని కోరుతూ సోమవారం గొందూరు గ్రామస్థులు ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఇరిగేషన్ పోలవరం ప్రాజెక్టు, ఏపీ జెన్‌కో, టూరిజం, దేవాదాయ శాఖ తదితర అధికారులు భాగల్కోట్‌లోని శ్రీకూడల సంగమేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించి సలహాలు తీసుకుని ఫైనల్ డిజైన్ ఖరారు చేసి గండిపోశమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు.

నిర్వాసితుల సమస్యలను పరిష్కరించండి

దేవీపట్నం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై సోమవారం ఢిల్లీలోని కేంద్ర జలశక్తి మంత్రిని సీపీఐ(ఎం) బృందం కలిసింది. సీపీఎం రాజ్యసభ పార్లమెంటు పక్ష నాయకుడు జాన్ బ్రిట్టాస్, నాయకులు వి.శ్రీనివాసరావు, కె.లోకనాథ్, కె.సురేంద్ర, బొప్పెన కిరణ్, ధర్ముల రమేష్ కలిసి పోలవరం నిర్వాసిత గ్రామాల్లో సమస్యలను వివరించారు. దీనిపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి ముంపు ప్రాంతాల్లో పర్యటనకు పంపిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు.

పంచాయతీ అవకతవకలపై విచారణ జరపాలి

కూనవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కూనవరం పంచాయతీ నిధులు వ్యవహారంపై విచారణ జరపాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను అన్నారు. పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 మే 5న సర్పంచ్ కట్టం రాజమ్మ చనిపోవడంతో అప్పటి నుంచి ఉపసర్పంచ్ హేమంత్ సర్పంచ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. అతడు తప్పుడు మార్గంలో బిల్స్ పెట్టి నిధులు దారి మళ్లించారని ఆరోపించారు. గతంలో పనిచేసిన కార్యదర్శి, సర్పంచ్ పనులు చేయకుండానే ఏకపక్షంగా వ్యవహరించి నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కారం సంధ్య, గుజ్జ కమల, నాయకులు కట్టం వెంకటేష్, చిన్నయ్య, అనిల్, గోపి, కోటేశ్వరరావు ఉన్నారు.

సీపీఎంపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

కూనవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సీపీఎంపై బీజేపీ నాయకుడు పాయం వెంకయ్య తప్పుడు ఆరోపణలు మానుకోవాలని పెద్ద ఆర్కూర్ సర్పంచ్ నాగమణి అన్నారు. ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీపీఎం పేద గిరిజనుల పక్షాన పోరాటం చేస్తుంటే బీజేపీ నాయకులు భూస్వాములకు కొమ్ముకాస్తున్నారన్నారు. వెంకయ్య రాజకీయ ఉనికి కోసం తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు.

అంబులెన్సులో ప్రసవం

చింతూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రసవ వేదన పడుతున్న సాందుల బుచ్చెమ్మను చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగానే ఆమె అంబులెన్సులోనే ప్రసవించింది. ఈ ఘటన చింతూరు మండలం ఉలుమూరులో సోమవారం జరిగింది. బుచ్చమ్మకు పురిటి నొప్పులు మొదలవడంతో స్థానిక ఆశావర్కర్ సమాచారంతో ఉలుమూరు చేరుకున్న అంబులెన్సు బుచ్చెమ్మను ఆసుపత్రికి తరలిస్తుండగానే నొప్పులు అధికమయ్యాయి. దీంతో ఈఎంటీ సుజాత, పైలట్ వెంకటేష్ కాన్పు నిర్వహించారు. బుచ్చెమ్మ మగ శిశువుకు జన్మనిచ్చింది. తదుపరి తల్లీబిడ్డను ఆసుపత్రికి తరలించారు.

అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించొద్దు

మారేడుమిల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గిరిజన యువత అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించొద్దని సీఐ టీజీఎస్ ప్రసాద్ అన్నారు. సోమవారం కానివాడ పంచాయతీ గిరిజన యువకులతో ఆయన మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని, గిరిజన గ్రామాల్లో కొత్త వ్యక్తుల సంచారంపై సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన యువతకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మారేడుమిల్లి, గుర్తేడు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరామగిరిలో కృష్ణాష్టమి వేడుకలు

వీఆర్ పురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరామగిరి కొండపై సీతారామస్వామి ఆలయంలో చైర్మన్ పెందుర్తి సుదర్శన్ దంపతుల ఆధ్వర్యంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆచంట శ్రీను దంపతులు పాల్గొన్నారు.

చెట్టు కిందనే రక్తపూతల సేకరణ

చింతూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొద్ది కాలంగా కురుస్తున్న వర్షాలకు చంద్రవంక వాగు మీదుగా వాహనాలపై ప్రయాణించే పరిస్థితి లేదు. దీంతో హెల్త్ అసిస్టెంట్ తోడెం కోటేశ్వరరావు వాగు పక్కనున్న ఓ చెట్టునే కార్యాలయంగా మల్చుకున్నాడు. ఆవలి గ్రామాల నుంచి వచ్చిన జ్వర పీడితుల నుంచి రక్తపూతలు సేకరించి సత్వర చికిత్స అందించారు.

జీవనోపాధి కల్పించాలి

మోతుగూడెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక యూఈఈయూ కార్యాలయంలో ఆదివాసీ గిరిజన సంఘ ఆధ్వర్యంలో డొంకరాయి కార్యదర్శి కె.ముక్త అధ్యక్షతన సమావేశం జరిగినది. రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతా రాంబాబు మాట్లాడుతూ సీలేరు మొదలుకొని మోతుగూడెం వరకు ఉన్న సుమారు 30 గ్రామాల్లో 300 మంది పైన నిరుద్యోగ యువత ఉందని వారికి జీవనోపాధి కల్పించాలని ఏపీ జెన్కో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో గిరిజన సంఘ నాయకులు పాల్గొన్నారు

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

మల్లిసాల మత్స్య సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవం

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మల్లిశాల మత్స్య సహకార సంఘం (రిజిస్ట్రేషన్ నెంబర్ బీ 48) ఎన్నికలు కాకినాడ రూరల్ మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కే.మధుబాబు పర్యవేక్షణలో ప్రశాంతమైన వాతావరణంలో ముగిశాయి. మల్లిశాల కోఆపరేటివ్ ఫిషర్ మ్యాన్ సొసైటీ ప్రెసిడెంట్‌గా ఇంజరపు రాజు, సెక్రటరీగా గాలింకుల భీమరాజు, డైరెక్టర్లగా ఆకుమర్తి సత్యానందం, ఆకుమర్తి గౌతయ్య, జగ్గు సత్తిరాజు, కుంచె అప్పారావు, బార్కుల అప్పారావు, నంది కోళ్ల అప్పారావులను ఏకగ్రీవంగా సంఘ సభ్యులు ఎన్నుకున్నారు. నూతన పాలకవర్గాన్ని టీడీపీ నాయకులు పైడిపాల సూరిబాబు, సర్పంచ్ సర్వసిద్ధి లక్ష్మణరావు, ముంద్రు ఎర్రబాబు ఆధ్వర్యంలో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈఎన్నికలకు సహకరించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కి ప్రెసిడెంట్ ఇంజరపు రాజు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఇంజరపు దుర్గ బాబు, తొట్టిపూడి నాగేశ్వరరావు, పల్లికొండ భద్రం, సేవా బుల్లి దొర, ఆకుమర్తి గణేష్ పాల్గొన్నారు.



జగ్గంపేట రూరల్: నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

జగ్గంపేట మత్స్య సంఘం ఎన్నిక ఏకగ్రీవం

జగ్గంపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సంజీవ్‌కాలనీలో కమిటీ హాల్‌లో ది జగ్గంపేట సంజీవి మత్స్య సహకార సంఘం (రిజిస్ట్రేషన్ నెంబర్ బీ 28) ఎన్నికలు మత్స్య శాఖ అభివృద్ధి అధికారి వేట్లపాలెం ఆర్.నూకరాజు ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా జరిగాయి. ప్రెసిడెంట్‌గా కడితి పైడియ్య, వైస్ ప్రెసిడెంట్ కడితి ప్రసాద్, సెక్రెటరీ కందరాడ చంద్ర రావు, సభ్యులుగా సలాది రాజబాబు, మురారి బుజ్జి బాబు, సంకుమల్ల రమణ, సలాది చిన్న కాటయ్య, మర్ల ప్రకాష్, మర్ల రాజ బాబు, బూర చక్రంను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన పాలకవర్గాన్ని టీడీపీ నాయ కుడు లాజర్ ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం అంబేడ్కర్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈఎన్నికలకు సహకరించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మండలాధ్యక్షుడు జీను మణిబాబు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సాంబత్తుల చంద్ర శేఖ ర్, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి తుమ్మల కిషోర్‌కి కడితి పైడియ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కడితి లాజర్, సలాది విజయరత్నం, నొక్కు సాయిబు, నొక్కు శ్రీను, పిట్ట గౌతమి, కడితి భూషణం తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా రహదారులు



చిల్లంగి నుంచి వేలంక ప్రధాన రహదారి

కిర్లంపూడి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వర్షాలకు కిర్లంపూడి నుంచి ప్రత్తిపాడు, చిల్లంగి నుంచి వేలంక వెళ్లే ప్రధాన రహదారులు, రాజుపాలెం నుంచి గోనేడ వెళ్లే రహదార్లు గుంతలమయంగా మారాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలపై ప్రయాణించాలంటే నరకంగా ఉందని, ద్విచక్ర వాహనదారులు రాత్రి సమయాల్లో గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారని ప్రజలు తెలిపారు. రహదారులను అభివృద్ధి చేసి గుంతలు పూడ్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కోటనందూరు, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కుట్టుమిషన్ శిక్షణ ఎంతో ఉపయోగపడతాయని ఎంపీడీవో వెంకట నారాయణ, ఎస్ఐ రామకృష్ణ అన్నారు. సోమవారం కోటనందూరు వెలుగు కార్యాలయంలో కుట్టుమిషన్ల టైలరింగ్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని కోరారు. ఏపీఎం సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

తొండంగి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు తక్షణం పరిష్కరించి, మండల విద్యాశాఖ అధికారుల బదిలీలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓలేటి బీవీ శాస్త్రి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన తొండంగిలో విలేకర్లతో మాట్లాడారు. అనేక ఏళ్లుగా మండల విద్యాశాఖ అధికారులు బదిలీలు లేవని, ఈదసరా సెలవుల్లో తక్షణం బదిలీలు చేపట్టాలన్నారు. 22ఏళ్లుగా మండల విద్యా కేంద్రంలో పనిచేస్తున్న ఎంఐఎస్లు, అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు బదిలీ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఓలేటి శాస్త్రి

సీఆర్పీలను కూడా బదిలీ చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులను నూరు శాతం ప్రమోషన్లతో బదిలీ చేయాలన్నారు. మిగులు స్కూల్ అసిస్టెంట్లను పీఎస్ హెచ్‌ఎంలుగా పంపడం వల్ల ఎస్జీటీలకు తీవ్ర అన్యాయం జరుగు తుందని, దీన్ని ప్రభుత్వం తక్షణం సవరించాలన్నారు. స్కూల్ అసిస్టెంట్లను వెనక్కి పంపి ఎస్జీటీలతో వీటిని భర్తీ చేయాలన్నారు. పీఆర్సీ కమిషన్ నియమించి తక్షణం ఐఆర్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆగని బస్సులు.. విద్యార్థుల అవస్థలు



మల్లేపల్లిలో కాలేజీకి వెళ్లేందుకు బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

గండేపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఫ్రీ బస్సు పథకాన్ని అమలు చేయడంతో బస్సులు మహిళలతో నిండిపోతున్నాయి. దీంతో ఉదయాన్నే కాలేజీలకు, సాయంత్రం ఇంటికి వచ్చేందుకు విద్యార్థులు బస్సు ఎక్కేందుకు ఖాళీ లేక డ్రైవర్లు బస్సులు ఆపడం లేదు. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు.మండలంలో నీలాద్రిరావుపేట నుంచి మురారి వరకు 19కిలోమీటర్ల మేర జాతీయ రహదారిని ఆనుకుని జడ్.రాగంపేట, తాళ్లూరు, బొర్రంపాలెం, మల్లేపల్లి, గండేపల్లి గ్రామాలున్నాయి. ఈగ్రామాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు బస్సుల్లో కాలేజీలకు వెళ్తుంటారు. కానీ బస్సులు ఆగకపోవడంతో వీరు ప్రయాణించడానికి ఇబ్బందికరంగా మారింది. అధికారులు విద్యార్థుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

జగ్గంపేట, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం ఎంపీపీ నాగ బాబు ఆధ్వర్యంలో మండల సమావేశం జరుగుతుందని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు.



ప్రత్తిపాడు బస్టాండ్ వద్ద వర్షం నీటిని మళ్లిస్తున్న పంచాయతీ సిబ్బంది

ప్రత్తిపాడు బస్టాండ్‌లో సీసీ రోడ్డు నిర్మాణం

జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాస్

ప్రత్తిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ రోడ్డు చేపట్టనున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాస్ తెలిపారు. కాంప్లెక్స్‌లో అపారిశుధ్యం దుస్థితిపై ఈనెల 10, 14 తేదీల్లో ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనాలు ప్రచురించిన సంగతి విషయం తెలిసిందే. బస్టాండ్ పరిసరాలు అధ్వానంపై రెండుసార్లు సందర్శించినట్టు, ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ ఉన్నా, ఎదురుగా అది లేకపోవడం వల్ల ఈ రకమైన దుస్థితి ఉందన్నారు. ప్రత్తిపాడు పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు బస్టాండ్ పరిసరాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టారు. నీటి మళ్లింపు చర్యలు తీసుకోవడంతోపాటు ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో బ్లీచింగ్‌తో పాటు పరిశుభ్రత చర్యలు నిర్వహించారు.



ఏలేశ్వరం పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

రైతుల ఆందోళన

ఏలేశ్వరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెక్కారావు కాలనీ సమీపంలో పంటకాలువ మధ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నిర్మించడంపై రైతులు ఆందోళన చేపట్టారు. సోమవారం నగర పంచాయతీలో గ్రీవెన్స్ అధికారి సూర్య ప్రకాశరావుకు నోమ్సు సూరిబాబు, కోరాడ బాబు, సతివాడ వెంకన్న, కర్రోతు సత్యనారాయణ, పైల అప్పన్న, నీలి భద్రరావు వినతిపత్రం అందజేశారు. కాలువలో ట్రాన్స్‌ఫార్మర్ నిర్మిస్తే పూడికతీత, విద్యుత్ షాక్ అయ్యే అవకాశం ఉందన్నారు. దీనిపై విద్యుత్ ఏఈకి ఎన్నిసార్లు చెప్పినా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేత్ర వైద్య శిబిరంలో 100 మందికి కంటి పరీక్షలు

తుని రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అకీరా కంటి ఆసుపత్రి రాజమండ్రి వైద్యులు సుమారు 100 మంది కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు, ఎం.త్రిమూర్తులు, జనరల్ సెక్రటరీ వీఎస్ఆర్ ఆంజనేయ ప్రసాద్, కోశాధికారి కృష్ణ, తదితరులు ఉన్నారు.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

తుని రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికలకు క్యాడర్ సన్నద్ధం కావాలని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు కోరారు. తేటగుంట టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ కీలక నాయకులు, కార్యకర్తలతో సోమవారం ఆయన సమావేశం జరిపారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి, మండలా ధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, కోటనందూరు మండలాధ్యక్షుడు పోతల సూరిబాబు, తెలుగు మహిళా అధ్యక్షురాలు తమరాన వరలక్ష్మి, తమరాన రామకృష్ణ, తమరాన సత్యనారాయణ, ఐ.సత్యనారాయణ, గజ్జి అప్పలరాజు తదితరులు ఉన్నారు.

యనమలకు భారతీయ ధర్మ పరిషత్ చైతన్యయాత్రకు ఆహ్వానం: అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో భారతీయ ధర్మ పరిషత్ తలపెట్టిన

కార్యకర్తలకు యనమల హితవు

చైతన్య పాదయాత్రకు యనమల రామకృష్ణుడుకి ఆహ్వానం అందించారు. స్త్రీయజ్ఞ వలక్యం రాజాశ్రమం ట్రస్టు సభ్యులు తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయానికి చేరుకుని ఆయనకు ఆహ్వానం అందించారు. చైతన్య పాదయాత్ర అనంతరం సనాతన ధర్మసభ ఏర్పాటు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆహ్వానం అందించిన వారిలో అఖిలాంధ్ర సాధుపరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కృష్ణ శరణానంద భారతిస్వామి, దంత వైద్యులు డాక్టర్ రత్నభరత్ ఉన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి యనమల

అసైన్డ్ భూములను అధికారులు కాపాడాలి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బవురువాక అసైన్డ్ భూములను అధికారులు కాపాడాలని గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కించు జోగిరాజు, బీజేపీ నాయకుడు సింగిలిదేవ్ సత్తిరాజు, పలువురు గిరిజనులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ పుణ్యవతికి వినతిపత్రం అందజేశారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జోగిరాజు తదితరులు

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళి

ఏలేశ్వరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మోక్షగుండం విశ్వేశ్వరయ్య కృషి నేటి ఇంజనీర్లకు స్ఫూర్తినిస్తుందని మార్స్ కంప్యూటర్స్ అధినేత అడపా దుర్గారావు అన్నారు. విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని సోమవారం మార్స్ కంప్యూటర్స్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, మణికంఠ, దివ్య, నవ్య పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడులో వర్షం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. నాలుగు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో ఆయా గ్రామాల్లోని రహదారులు చిత్తడిగా మారి అపారిశుధ్య పరిస్థితులు ఉన్నాయి. ఈ విషయమై పంచాయతీ సిబ్బందికి పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ మండలాధ్యక్షుడు కోడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం యూటీఎఫ్ ప్రతినిధుల మోటార్ బైక్ ర్యాలీ కత్తిపూడి, ఎర్రవరం తదితర చోట్ల నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో వేద-2కే25 టెక్‌ఫెస్ట్

గండేపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య విద్యా ప్రాంగణంలో పాలిటెక్నిక్ కళాశాలలో వేద 2కే25 జాతీయ స్థాయి టెక్‌ఫెస్ట్‌ను సోమవారం ప్రారంభించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌టీవీఎస్ కుమార్ తెలిపారు. ముఖ్య అతిథులుగా కాకినాడ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ జీవీ రామచంద్రరావు, ఆదిత్య యూనివర్శిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎస్.సతీష్‌రెడ్డి, డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, గౌరవ అతిథులుగా జువారి సిమెంట్ లిమిటెడ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి.శ్రీకాంత్‌రెడ్డి, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ ఎస్.నవీన్ హాజరయ్యారు. డీన్ ఏవీ మాధవరావు, అసోసియేట్ డీన్ పొన్నాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నాయకంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న నాయకంపల్లి, యల్లమిల్లి గ్రామాలకు మంగళవారం ఉదయం 8 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ వీరభద్రరావు, గండేపల్లి ఏఈ కిరణ్‌కిషోర్ తెలిపారు.

కిర్లంపూడిలో వర్షం

కిర్లంపూడి, సెప్టెబరు 15 (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడిలో సోమవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రామాలయం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించండి

రౌతులపూడి, సెప్టెబరు 15(ఆంధ్రజ్యోతి): పారుపాలకలో నూతనంగా రామాలయం నిర్మించుకోవడానికి వెలమ కార్పొరేషన్ నిధులు మంజూరు చేయించాలంటూ రౌతులపూడిలో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావును గ్రామస్థులు కోరారు. పారుపాక టీడీపీ నేత పడాల తిరుమల వెంకన్నదొర ఆధ్వర్యంలో సాంబశివరావును కలిశారు.

రాధాకృష్ణులకు విశిష్ట పూజలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని ఎస్‌బీఐబ్యాంక్ వీధిలో గల వర్తక సంఘం అధ్యక్షుడు అనంతపల్లి శ్రీనివాస్ నివాస గృహం వద్ద రాధాకృష్ణలకు సోమవారం విశిష్టపూజలు నిర్వహించారు. ఉట్టి కొట్టే సంబరాలు నిర్వహించారు. శ్రీనివాస్, సరళ దంపతులు రాధాకృష్ణులకు విశిష్ట పూజలు నిర్వహించి పలు రకాల వంటకాలతో నైవేద్యాలు సమర్పించారు.

ధర్మవరంలో భారీ అన్నదానం

ప్రత్తిపాడు,సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ధర్మవరం శెట్టిబలిజవీధిలో వినాయక కల్యాణ మండపం వద్ద సోమవారం శెట్టిబలిజ యువజన సంఘం, సేవామిత్ర అవార్డు గ్రహీత రాయుడు దొరబాబు ఆధ్వర్యంలో భారీఅన్నదానంనిర్వహించారు. 8వేలమంది భక్తులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం


జగ్గంపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడ రోడ్డులోని ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద అన్న క్యాంటీన్‌లో సోమవారం మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్ ఆర్థిక సహాయంతో పేదలకు అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు హాజరై పేదలకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టీడీపీ పట్టణాధ్యక్షుడు పాండ్రంగి రాంబాబు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దేవరపల్లి మూర్తి, టీడీపీ నేత పాలచర్ల నాగేంద్ర చౌదరి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలి

శంఖవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం కత్తిపూడిలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్వర్యంలో నిర్వహించిన రణభేరి బైక్ ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి సూరిబాబు, నగేష్, జిల్లా కార్యదర్శి తోట సీతారామయ్య, చంటిబాబు పాల్గొన్నారు.



జగ్గంపేట ఆర్టీసీ కాంప్లెక్స్ సెంటర్‌లో బైక్ జాతా నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

రణభేరిని జయప్రదం చేయాలి

జగ్గంపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు జరగనున్న యూటీఎఫ్ రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీగోపిమూర్తి కోరారు. సోమవారం బైక్ జాతా జగ్గంపేటకు చేరుకుంది. ఆర్టీసీ కాంప్లెక్స్ సెంటర్‌లో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పీవీ సత్యనారాయణ మాట్లాడారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు టి.రవి చక్రవర్తి, ఎన్ అరుణకుమారి, కె.శ్రీదేవి, బి.సుభాషిణి, యూటీఎఫ్ కాకినాడ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీహెచ్ సూరిబాబు, కెవీవీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.